క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



పొన్నూరు: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ వీర నాయక్ తెలిపిన వివరాలు.. షరాఫ్ బజార్‌లో డీలర్ మునీర్ వద్ద కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ముగ్గురు వ్యక్తులు వాహనంలో బోడపాడుకు తరలించే క్రమంలో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వాహనంలో ఒక్కొక్కటీ 50 కిలోలు ఉన్న 31 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. తరలిస్తున్న రబ్బానీ, ఎ.శ్రీనివాసరావు, అంకమ్మనాయుడులతో పాటు బోడపాడుకు చెందిన ఆనంద్‌తో పాటు డీలర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదరిక నిర్మూలనపై వ్యాసరచన పోటీలు



గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం లిటరసీ కమిటీ ఆధ్వర్యంలో నేషనల్ ఎరిడిక్షన్ పావర్టీ డేను నిర్వ హించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పేదరిక నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కబనరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ తుమ్మ సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ షారోన్‌రోజ్, కమిటీ కన్వీనర్ ఫణి రాజ్యలక్ష్మి, సంధ్య, అనిత, సరోజ, విజయలక్ష్మి, అనితభాను, జాయ్‌సి పాల్గొన్నారు.

వినోద్ కుటుంబానికి పరామర్శ

గుంటూరు రూరల్: మండలంలోని 47వ డివిజన్ గోరంట్లలో అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గుడిస వినోద్ మృతదేహాన్ని ఆ పార్టీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ సందర్శించి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తెనాలి ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నెహ్రూ నగర్: నగర పాలక సంస్థలో విధులు నిర్వహించే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని, గ్రీవెన్స్‌లో అందే అర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాధిపతులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఈఈ కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాషా, విభాగ సూపరింటెండెంట్లు, కార్మిక సంఘాల నాయకులు మధుబాబు, మాల్యాద్రి, ముత్యాలరావు, శంకర్‌రావు, రవికుమార్ పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి.యేసు రత్నం పేర్కొన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈఓ యేసురత్నం మాట్లాడుతూ భవిష్యత్‌లో కంప్యూటర్ రంగంలో క్వాంటం టెక్నాలజీ పరంగా అనేక మార్పులు సంభవిస్తాయని తెలిపారు. క్వాంటం అందుబాటులోకి వస్తే బ్యాంకింగ్, వైద్యం వంటి అనేక రంగాల్లో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా మాట్లాడారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఈనెల 18న విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొంటారని తెలిపారు.

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు

- పెరిగిన పిచ్చిమొక్కలతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు





ఒకటో వార్డులోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

పొన్నూరు: పట్టణ ప్రధాన ప్రాంతాల్లోని పలు ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. నివాస ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు ఆ స్థలాల్లో వర్షపు నీరు చేరి మురుగు పారుదల లేక దోమలకు ఆవాసాలుగా మారాయి. మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ప్రాంతాల్లో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు విరివిగా పెరిగాయి. స్థలాల యజమానులు శుభ్రం చేయకపోవడంతో మొక్కలు కాస్త పెరిగి పెద్దవైపోయి చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన మొక్కలు, మురుగు పేరుకుపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. విష పురుగులు సంచరిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. సమస్యపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

- రాయలసీమ వర్సిటీ వీసీ వెంకటబసవరావు
- ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయ స్థాయి సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, అతిథులు

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా గ్రీన్ హౌస్ వాయువుల విడుదల తగ్గించేందుకు పరిశోధనలు జరగాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి.వెంకటబసవరావు పేర్కొన్నారు. మండలంలోని చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్‌లో శుక్రవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, అమరావతి రీజినల్ సెంటర్, కళాశాల సంయుక్తాధ్వర్యంలో జాతీయ సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్బన్ డైరెక్ట్ కాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ కరెంట్ స్టేటస్, చాలెంజెస్, ఫ్యూచర్ ప్రోగ్రెస్ అనే అంశంపై సదస్సు చేపట్టారు. ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ కార్బన్ డైరెక్ట్ కాప్చర్ యుటిలైజేషన్ స్టోరేజ్ ఆవశ్యకతను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్ ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీ చౌదరి మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2070 సంవత్సరం నాటికి కార్బన్ డై ఆక్సైడ్ విడుదలను అరికట్టే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఐఐసీహెచ్‌ఈఏఆర్సీ చైర్మన్ ప్రొఫెసర్ వి.గోవర్ధనరావు మాట్లాడుతూ భారతదేశం కార్బన్ డై ఆక్సైడ్ విడుదలలో ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని చెప్పారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సదస్సులో 850 మంది పాల్గొన్నారని సదస్సు రెండు రోజులపాటు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, సీఎస్ఐఆర్ ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ సుమనచన్న, టి.అన్నజిరవికుమార్, కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం గౌరేశ్వరీదేవి

చేబ్రోలు: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. గుంటూరు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్-19 స్కూల్ గేమ్స్ వాలీబాల్ గుంటూరు జిల్లా జట్ల ఎంపికలు గురువారం నిర్వహించారు. జిల్లా జట్టులో వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మొగల్ ఆసిఫ్, యంపరాల భవానీ, షేక్ ఖాదర్‌మున్నీ ఎంపికయ్యారు. అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను హెచ్‌ఎం గౌరేశ్వరీదేవి, వ్యాయమ ఉపాధ్యాయులు తిరుమలశెట్టి వెంకటేశ్వరావు, దాసరి విజయదుర్గ, పీఎంసీ చైర్మన్ పఠాన్ రబియా అభినందించారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

సీఐటీయూ గౌరవ అధ్యక్షురాలు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ

లక్ష్మీపురం: మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తక్షణమే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు పాతగుంటూరులోని సంఘ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా అంగన్‌వాడీలకు ఇచ్చిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమని అన్నారు. అంగన్‌వాడీలకు భారంగా ఉన్న యాప్‌లను రద్దు చేస్తామని చెప్పిన కూటమి నాయకుడు అధికారంలోకి వచ్చిన తర్వాత భారంగా ఉన్న యాప్‌ను రద్దు చేయకపోగా కొత్త యాప్‌లతో మరింత భారాన్ని రుద్దుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ఇస్తామన్న టీఏ బిల్లులను చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీ లను ప్రభుత్వ ఉద్యోగులనీ చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని విన్నవించారు. అంగన్‌వాడీ లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో కరెంట్ బిల్లులు చెల్లించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీలకు చట్టం ప్రకారం 200 యూనిట్లు లోపు వాడే వారందరికీ ఉచితంగా ఇవ్వాల్సి ఉన్నా. అంగన్‌వాడీలకు మాత్రం అమలు చేయడం లేదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జిల్లాలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీఎన్ కుమారి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, యూనియన్ జిల్లా నాయకులు రత్న మంజుల, ప్రేమలత, అస్మిత్తారా, శివ లీల శివపార్వతి, షాహిదా పాల్గొన్నారు.

ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్న సైబర్ నేరాలు



మాట్లాడుతున్న సైబర్ సెక్యూరిటీ విభాగ సీఐ నిస్సార్ బాషా

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ క్రైమ్స్ కారణంగా వ్యక్తులు, కుటుంబాల ఆర్థిక మూలాలు దెబ్బతింటున్నాయని సైబర్ సెక్యూరిటీ విభాగ సీఐ నిస్సార్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిస్సార్ బాషా మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అయ్యిందని, ఖాతాను పునరుద్ధరించేందుకు డెబిట్ కార్డు వివరాలు కోరితే అది సైబర్ క్రైమ్ అని చెప్పారు. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులను నమ్మరాదని, వారితో ఆర్థిక కార్యకలాపాలను కొనసాగించరాదని సూచించారు. పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగే విధానం, వాటిని సమర్థంగా తిప్పికొట్టే విధానాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో సైబర్ క్రైమ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసుశాఖ సిబ్బంది జి.రాజకిషోర్ టి.అరుణకుమారి, బి.మానస, షేక్ ఇమామ్ హుస్సేన్, షేక్ యాసిన్, పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్ర బాబు, డైరెక్టర్ సాయి శ్రీకర్, హెచ్‌ఎం మీనాక్షి, ప్రిన్సిపాల్ కళ్యాణి పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

పొన్నూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రజా ఉద్యమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ మండల అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని కొండమూదిలో ప్రజల నుండి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాసరావు, బోయిన శేషగిరిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చదనంపై శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎల్ఎస్‌డీజీ టీం ఆధ్వర్యంలో పరిశుభ్రత- పచ్చదనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, థీమ్ 5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ గురించి డ్వాక్రా యానిమేటర్లు, గ్రూపు సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి విద్యాసాగర్‌రెడ్డి, డెప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎం షాలేమ్‌రాజు, సత్యానంద్, హరికృష్ణ పాల్గొన్నారు.

వైద్య విద్యను పేదలకు దూరం చేసే కుట్ర

- వైద్య కళాశాలలకు వ్యతిరేకంగా ఉద్యమం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సంతకాల పత్రాలను చూపుతున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: వైద్య విద్యను పేదలకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేపట్టిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జొన్నలగడ్డలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను, ప్రజా ధనాన్ని అమ్ముకోవటం సొమ్ముచేసుకోవటం పనిగా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలంతా ఐక్యమత్యంగా పోరాటం చేసి ప్రభుత్వ వైద్య కళాశాలలను, ప్రభుత్వ ఆస్తులను ప్రజా ధనాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో తెనాలి, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వంగా సీతారామిరెడ్డి, కొండా కోటిరెడ్డి, వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమ మేధ సమాజ శ్రేయస్సుకు అవసరం

ప్రొఫెసర్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్య



ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని: సమాజ ప్రయోజనాల కోసం కృత్రిమ మేధ దోహదపడుతుందని ప్రొఫెసర్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్య అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్‌లో సాంకేతిక పురోగతులు అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ సుబ్రహ్మణ్య ప్రసంగంలో ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధ ప్రాముఖ్యాన్ని వివరించారు. భవిష్యత్ ఉద్యోగాలు అన్ని ఈ సాంకేతికతలను అర్థం చేసుకునే నైపుణ్యాలపై ఆధారపడతాయని వివరించారు. విద్యార్థులు ఏఐ, డేటా సైన్స్ కంప్యూటింగ్ వంటి రంగాలలో పునాది జ్ఞానం సాధించి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవాలని కోరారు. సమస్య పరిష్కార దృక్పథం, బహుముఖ ఆలోచనా శక్తి, సృజనాత్మకత అనేవి భవిష్యత్ ఇంజినీర్లకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ సెమినార్‌కు ఏఎన్‌యూ రెక్టర్ ప్రొఫెసర్ రామినేని శివరామ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ క్రత్రిమ మేధ విద్య, పరిశోధన సమాజ అభివృద్ధిలో కలిగిస్తున్న మార్పులపై ప్రస్తావించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లింగరాజు మాట్లాడుతూ, ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో సాంకేతిక అవగాహన పెంపొందించి, పరిశ్రమ–అకాడమిక్ మధ్య అనుసంధానాన్ని పెంచుతాయన్నారు. సెమినార్‌లో అమెరికాకు చెందిన ఎక్సలెన్స్ సీఈఓ సాన్‌డియాగో, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఐఎంఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ డీబీ రత్నాకర్, డాక్టర్ ఎం.గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

డేటా ఆధారిత నిర్ణయాలపై వ్యాపార ప్రపంచం

అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్సై.శ్రీకాంత్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక వ్యాపార ప్రపంచం పూర్తిగా డేటా ఆధారిత నిర్ణయాలపై ఆధారపడుతోందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్సై.శ్రీకాంత్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎక్సెల్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, ఆర్ ప్రోగ్రామింగ్‌ను ఉపయోగిస్తూ బిజినెస్ అనలిటిక్స్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాంత్ మాట్లాడుతూ బిజినెస్ అనలిటిక్స్ శాస్త్రం ఎంతో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింగరాజు వెంకటరమణ మాట్లాడుతూ పరిశ్రమల తాజా ధోరణులను అర్థం చేసుకునేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌ల దోహదం చేస్తాయని చెప్పారు.కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ వి. చక్రవర్తి, రాజ్యలక్ష్మి, చల్లా వైష్ణవి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు అభిలాష్, శశికళ, ప్రియాంక, గణేష్, వర్షిత, వెంకట కళ్యాణ్, ఉమాదేవి పాల్గొన్నారు.

లివర్‌పై నిర్లక్ష్యం వద్దు

- పెరుగుతున్న కాలేయ వ్యాధి బాధితులు
- లివర్ క్యాన్సర్ అవగాహన నెల అక్టోబర్



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలితో లివర్ వ్యాధులు పెరిగాయి. మన శరీరంలో అతి పెద్ద గ్రంధి లివర్. పనిచేయకపోతే అనేక రోగాలు శరీరాన్ని చుట్టుముడతాయి. మన దేశంలో అత్యధిక సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. సకాలంలో గుర్తించి వైద్యం చేయించని పక్షంలో లివర్ క్యాన్సర్లుగా మారే ప్రమాదం ఉంది. క్యాన్సర్ బారిన పడకుండా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతిఏడాది అక్టోబర్ నెలను లివర్ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

లివర్ చేసే పనులు...

ఉదరంలో ఉదరవితానికి కిందగా కుడి వైపున మధ్యలో కాలేయం ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయటం, జీర్ణక్రియకు దోహదపడే పైత్యరసాన్ని ఉత్పత్తి చేయటం, శరీరంలోని కొవ్వు, చక్కెర, ప్రోటీన్ శాతాన్ని నియంత్రిస్తుంది. శరీరం జబ్బు బారిన పడకుండా రక్షణ కల్పించటం, రక్త శుద్ధి చేయటం, శరీరంలోని విషాలను హరించటం చేస్తుంది. మనలో ప్రవేశించే హానికర పదార్థాలను తొలగించటం, ఆహారాన్ని శక్తి రూపంలోకి మార్చటం, వివిధ హార్మోన్ల విడుదలను నియంత్రణలో పెట్టడం, రక్తం గడ్డ కట్టడానికి, గాయాలు త్వరగా మానటానికి కావాల్సిన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేయటం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది.

కాలేయ సమస్యలకు ముఖ్యకారణాలు....

మత్తు పదార్థాలు, పొగ తాగటం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవటం, ఇన్‌ఫెక్షన్స్ వలన కాలేయ సమస్యలు వస్తాయి. లైంగిక సంబంధాలు, ఒకరికి వాడిన సూదిని మరొకరికి వాడటం వలన హెపటైటిస్ బీ, సీ వ్యాధులు సోకుతాయి. కలుషిత రక్తమార్పిడి, నీరు తాగటం, ఆహారం తీసుకోవటం వలన హెపటైటిస్ ఏ, ఈ వ్యాధులొస్తాయి. శారీరక వ్యాయామం లేకపోవటం, స్థూలకాయం వల్ల కొవ్వు పెరిగి కాలేయంపై పేరుకుపోతుంది. నూనె వస్తువులు ఎక్కువగా తినటం, పిజ్జాలు, బర్గర్స్‌లు, ఫాస్ట్‌ఫుడ్ వలన లివర్ వ్యాధులు వస్తాయి. శరీరానికి హానిచేసే మందులు ఎక్కువగా తీసుకోవటం వల్ల కూడా కాలేయ సమస్యలు తలెత్తుతాయి. మన రోగ నిరోధక శక్తి మన వైపే ప్రతికూలంగా పనిచేయటానికి అవకాశం ఉన్నప్పుడు, వంశపారంపర్యంగా కాలేయ వ్యాధులు వస్తాయి. తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కామెర్ల సమస్యలు ఉన్నట్లు భావించి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. కాలేయ సమస్యలను ముందస్తుగా గుర్తించి సకాలంలో వైద్యం చేయని పక్షంలో లివర్ క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంది.

లివర్ క్యాన్సర్ లక్షణాలు...

ఆకలి లేకపోవటం, పొత్తి కడుపులో నొప్పి రావటం . తరచుగా జ్వరం. ఆలసట, బలహీనంగా అనిపించడం. ఒక్కసారిగా బరువు తగ్గుతారు. కళ్లు, చర్మం పసుపురంగులోకి మారతాయి. తెల్లటి మలం వస్తుంది. మూత్రం ముదురు రంగులో వస్తుంది.

లివర్ బాధితులు...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లివర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా 7,992 మంది వ్యాధి బారిన పడినట్లు తేలింది. జిల్లాలో పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండగా ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఐదు నుంచి పది మంది లివర్ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్ ఓపీ వైద్య విభాగానికి ఒక్కో రోజు 20 మందికి పైగా లివర్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

కాలేయాన్ని ఇలా కాపాడుకోవాలి...



ఆల్కాహాల్ వలన లివర్ దెబ్బతింటుంది. మద్యం జోలికి వెళ్లొద్దు. కొవ్వు పదార్థాలు, వేపుళ్లు అతిగా తినవద్దు. పచ్చని ఆకు కూరలు తినటం వలన లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి. ఆలీవ్ ఆయిల్స్, వాల్‌నట్స్, గ్రీన్ టీ, ఆపిల్ పండ్లు, వెల్లుల్లి, పసుపు లివర్‌కు మేలు చేస్తాయి. విటమిన్ సీ ఎక్కువగా తీసుకుంటే కాలేయం వద్ద పేరుకుపోయే కొవ్వును నియంత్రణ చేస్తుంది. రోజూ నీటిని ఎక్కువగా తాగటం వలన కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. హెపటైటీస్ బీ సోకకుండా టీకాలు తీసుకోవాలి. బరువు అదుపులో పెట్టుకోవాలి.

–డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

లివర్ క్యాన్సర్లు పెరుగుతున్నాయి



ఆధునిక జీవనశైలి వలన లివర్ క్యాన్సర్‌లు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల్లో హెపటోబ్లాస్టోమాకు గురవుతున్నారు. జన్యుపరమైన లోపాలతో వస్తున్న ఈ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. లివర్ క్యాన్సర్ చికిత్సకు సర్జరీలు, రేడియేషన్ థెరపీ, ఇమ్యూనోథెరపీ, పాలియేటివ్ కేర్, టార్గెటెడ్ థెరపీ, లివర్ మార్పిడి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

ఏపీ హంస కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ హంస అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యాలయాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ప్రారంభించారు. ఏపీ హంస లోగోను హంస రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ప్రతి ఉద్యోగి తమకు బిడ్డలాంటి వారని చెప్పారు. వారికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా సహాయం చేసేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. హంస జిల్లా అధ్యక్షుడు బి.నాగవర్ధన్ మాట్లాడుతూ అసోసియేషన్ కార్యాలయాన్ని మంజూరు చేసినందుకు డీఎంహెచ్‌ఓకు కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో గుర్తింపు ఉన్న ఏకైక సంఘం ఏపీ హంస మాత్రమేనని చెప్పారు. అసోసియేషన్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వి.టి.పి.రాజ్యలక్ష్మి, కోశాధికారి వెంకటప్పయ్య, వైస్ ప్రెసిడెంట్ ఎం.డి.షరీఫ్, రవి, సిటీ ప్రెసిడెంట్ నరేంద్రబాబు, ఆషాలత, ప్రశాంతి పాల్గొన్నారు.